క్లుప్తంగా

మత్స్యకారుల సమస్యలపై మంత్రికి వినతి


వినతిపత్రం ఇస్తున్న క్రాంతి, మత్స్యకారులు

మంథని: మత్స్యకారుల సమస్యలపై మంథనిలోని బోయిన్‌పేటకు చెందిన మత్స్యకారులు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్ బాబును కలిసినట్లు మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతికుమార్ తెలిపారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో నియోజకవర్గంలో చేపల పెంపకం, పరిశ్రమల స్థాపన చేయాలని వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. అలాగే మత్స్యకారుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. సబ్బని సమ్మయ్య, పోతరవేన అర్జున్, పోలు కనకరాజ్, డిష్ రాజు, బొజ్జ శ్రీను, జడిగల లక్ష్మణ్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ.50వేల విరాళం

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ బూడిద అంజలి–స్వామి దంపతుల కుమారుడైన ప్రియతమ్ వివాహం సందర్భంగా రూ.50వేలు హెచ్‌ఎం శారదకు అందజేశారు. శుక్రవారం యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో రిసెప్షన్ సందర్భంగా సుల్తానాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలకు వాటర్ కూలర్ల కొనుగోలు కోసం నగదు అందజేశారు.

ఆర్థికసాయం అందజేత



కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన గుర్రాల అర్జున్ అనే యువకుడికి గోదావరిఖనికి చెందిన అక్షర స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం రూ.17వేలు అందజేశారు. అర్జున్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఫౌండేషన్ సభ్యులు అర్జున్ చదువుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఇతర దాతల సాయంతో నగదు అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు నాగరాజు, సభ్యులు తిరుపతి, గోవర్ధన్ ఉన్నారు.

ఆలయంలో హోమం

సుల్తానాబాద్: పట్టణంలోని సాంబశివాలయంలో శుక్రవారం హోమం నిర్వహించారు. శివుడికి అన్నపూజతో పాటు పలు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. శివాలయంలో వీరభద్రుడికి అర్చకులు మహేశ్, రమేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం కమిటీ చైర్మన్ సత్యనారాయణ, వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మురళి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని సబ్ డివిజన్ అల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9గంటల నుంచి దాదాపు 11 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గోదావరిఖని టీజీ ఎన్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరు సబ్‌స్టేషన్ పరిధి యైటింక్లయిన్‌కాలనీ, కేకే నగర్, సంతోష్‌నగర్, శ్రీపాద కాలనీ, హనుమాన్‌నగర్, అల్లూరు తదితర ఏరియాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతు దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని పేర్కొన్నారు.

ప్రభుత్వ హామీల అమలు కోసం పోరాటం

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలుకు బీజేపీ దశలవారీగా పోరాటం చేస్తుందని బీజేపీ సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్‌చార్జి పోల్సాని సంపత్‌రావు అన్నారు. మున్సిపాలిటీలో బీజేపీ సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు కోసం పోరాటం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజుయాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేసి ఆమోదం తెలిపారు. పార్టీ నాయకులు వనజ, మటూరి లత, భాగ్యలక్ష్మి, సతీశ్, సదయ్య, సంపత్, సతీశ్‌గౌడ్, సంతోష్, శంకరయ్య, సాయి, కొమురయ్య, ఈశ్వర్, సీనియర్ నాయకులు రాజేశ్వరరావు, ఎలిగేడు మండల అధ్యక్షుడు రమణారావు, పట్టణ ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

మానేరుపై వంతెన నిర్మించాలి

ఓదెల: మండలంలోని కనగర్తి మానేరుపై వంతెన నిర్మించాలని మడక మాజీ ఎంపీటీసీ ఆవుల ముక్తేశ్వర్ కేంద్ర హోంశాఖమంత్రి కిషన్ రెడ్డికి శుక్రవారం ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. మండలంలోని కనగర్తి వీణవంక మండలంలోని మల్లారెడ్డిపల్లె గ్రామాల మధ్య మానేరుపై వంతెన నిర్మిస్తే కరీంనగర్ జిల్లా జమ్మికుంట, వీణవంక మండలాలతో పాటు పెద్దపల్లి జిల్లా ప్రజలతో పాటు సింగరేణి కార్మికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

రెండేళ్లు.. 30 ప్రమాదాలు



ఓదెల: మండలంలోని హరిపురం రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఐదేళ్ల క్రితం కొలనూర్ గ్రామం మీదుగా హరిపురం గ్రామానికి తారురోడ్డు వేశారు. ఈమార్గంలో తారురోడ్డు వేసిన అధికారులు మూలమలుపు వద్ద ఉన్న కల్వర్టుపై బ్రిడ్జి నిర్మించాలని తారు వేయలేదు. దీంతో ఆ మూలమలుపు వద్ద రోడ్డు ఇరుకుగా మారడంతో పాటు మలుపులు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదంలో గ్యారవేని శ్రీనివాస్ మృతిచెందగా గుండేటి మహేందర్ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఇలా వరుసగా ప్రమాదాలు జరిగినా ప్రభుత్వం మాత్రం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రాణాంతకంగా మారిన హరిపురం రోడ్డు
- ప్రమాదాలకు నిలయంగా మూలమలుపు
- త్వరగా బ్రిడ్జి నిర్మించాలని వాహనదారులు, ప్రజల డిమాండ్

బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్

- మండలంలోని కొలనూర్, గోపరపల్లి, ఉప్పరపల్లె తదితర గ్రామాలకు చెందిన ప్రజలు హరిపురం మీదుగా మండల కేంద్రం ఓదెలకు వెళ్తారు. అయితే మూలమలుపు ప్రాణాంతకంగా మారిందని వారు వాపోతున్నారు. రాత్రిపూట ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నామని వాహనాదారులు చెప్తున్నారు. ఈ మూలమలుపు వద్ద రెండేళ్లలో 30రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఒకరు మృతి చెందారు. గతంలో పలు కార్లు పల్టీకొట్టడంతో గోదావరిఖని, జమ్మికుంటకు చెందిన పదిమంది తీవ్రగాయాలపాలయ్యారు. వర్షాకాలంలో నాగులకుంట నుంచి వచ్చే వరద ఉధృతికి రోడ్డుపై నుంచి నీరు వెళ్లడంతో రోడ్డు కోతకు గురవుతోంది. అసలే మలుపు రోడ్డు ఆపై వర్షాకాలంలో వరద ప్రభావంతో ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి వంతెన నిర్మించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

హరిపురం గ్రామానికి వెళ్లే రహదారిలో మూలమలుపు వద్ద కల్వర్టుపై బ్రిడ్జి నిర్మాణం కోసం నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే వెంటనే బ్రిడ్జిని నిర్మిస్తాం.

– బాషా, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, సుల్తానాబాద్

చొరవ తీసుకోవాలి



కొలనూర్ నుంచి హరిపురం వెళ్లే మార్గంలో మూలమలుపు వద్ద బ్రిడ్జి నిర్మించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలా ఏళ్ల క్రితం రోడ్డువేసినా మూలమలుపు వద్ద వంతెన నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొవాలి.

– బీష్మాచారి, ఆర్‌ఎంపీ, ఓదెల

అధికారులకు ఫిర్యాదు చేసినా..



హరిపురం నుంచి కొలనూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో మూలమలుపు వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలి. బ్రిడ్జి లేనందున రోడ్డు చిన్నగా ఉండడంతో ఇటీవల ఒకరు ప్రమాదానికి గురై మృతిచెందారు. ఇప్పటివరకు 30మంది గాయపడ్డారు. పలుసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

– గ్యారవేని నాగరాజు, మాజీ ఉపసర్పంచ్, హరిపురం



రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌కు దగ్గర్లోని వంతెన సమీపంలో ఎస్టీ కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు రోడ్డుపై నుంచి దిగువ ప్రాంతానికి పారుతోంది. దీంతో రోడ్డుపై వాహనాలు వెళ్లినప్పుడు పాదచారులపై పడుతోంది. సంబంధిత బల్దియా అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

ప్రమాదబీమా వర్తింపు కోసం హెచ్‌డీఎఫ్‌సీ ఖాతాలు


సమావేశం నిర్వహిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలోని వివిధ గనులు, విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రమాదబీమా సౌకర్యం కల్పించేందుకు హెచ్‌డీఎఫ్‌సీ వేతన ఖాతాలు తెరిపించేలా చర్యలు తీసుకోవాలని ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు అన్నారు. జీఎం కార్యాలయంలో సంబంధిత కాంట్రాక్టర్లు, విభాగాధిపతులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఅండ్ఎండీ ఎన్.బలరాం ప్రత్యేక కృషితో ఆ బ్యాంక్‌తో ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత ఉద్యోగులకు ప్రమాద బీమాపై అవగాహన కల్పించి వారితో వేతన ఖాతాలు తెరిపించాలని సూచించారు. కాంట్రాక్టర్లు వారి కరెంట్ ఖాతాలు, ఉద్యోగుల వేతన ఖాతాలు సులభ పద్ధతిలో తెరిపించేలా బ్యాంక్ సిబ్బంది సహకరించాలన్నారు. ఫైనాన్స్ విభాగాధిపతి పి.శ్రీనివాసులు, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్ బాబు, ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ప్రాజెక్టు అధికారులు వెంకటరమణ, రాజశేఖర్, అధికారులు రాజేంద్రకుమార్, కాశీ విశ్వేశ్వరరావు, సుదర్శనం, గుర్రం శ్రీహరి, సునీల్ ప్రసాద్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండుతో సంస్థ రిటైర్డ్ ఉద్యోగులు శుక్రవారం సమావేశమయ్యారు. ప్రాజెక్టు పరిపాలనా భవనంలోని ఛాంబర్‌లో ఆయనను కలిసి ఇటీవల రిటైర్డ్ ఉద్యోగులు రచించిన కవితల సంపుటి జ్యోతికిరణాలు–2 పుస్తకాన్ని అందించారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన అంశాలను ఆయనకు వివరించగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆకుల రాంకిషన్, తిరుమల సురేందర్, దుర్గం నర్సయ్య, వెంకటేశ్వర్లు, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

పెద్దపల్లిరూరల్: సమగ్ర శిక్షా అభియాన్‌లో 16ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించాలంటూ శుక్రవారం డీఈవో ఆఫీసులో వినతిపత్రం అందించారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామంటూ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఆర్‌పీల సంఘం జిల్లా అధ్యక్షుడు కుంబాల సుధాకర్, నాయకులు మల్లయ్య, శ్రావణ్‌కుమార్, సంపత్, రాజ్‌కుమార్, రహీం, రమేశ్, సంధ్యారాణి, రమణ, సతీశ్, శ్రీకాంత్ ఉన్నారు.

• ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ఓదెల: ఇంటింటి సర్వే వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయడాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో షబ్బీర్‌పాషా పాల్గొన్నారు.

• రెండురోజుల పాటు ఓటరు నమోదు

కమాన్‌పూర్: మండలంలో శని, ఆదివారాలు ఓటరు నమోదు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వాసంతి శుక్రవారం తెలిపారు.

• డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండురోజుల ట్రాఫిక్ డ్యూటీ

పెద్దపల్లిరూరల్: మద్యం సేవించి వాహనం నడిపిన వారిలో ఒకరికి రెండురోజుల ట్రాఫిక్ డ్యూటీ విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి మంజుల తీర్పు నిచ్చినట్లు ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుకున్న 17మందిని కోర్టుకు హాజరుపర్చామని, వారికి రూ.20,400 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అందులో అధికంగా మద్యం సేవించినట్లు తేలిన ఓ వ్యక్తికి రూ.వెయ్యి జరిమానాతో పాటు రెండురోజుల పాటు ట్రాఫిక్ విధుల కోసం ఉపయోగించుకోవాలని తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

• డిసెంబర్ 2న భగవద్గీత పోటీలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు డిసెంబర్ 2న నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి నాగుల మల్యాల సత్యం తెలిపారు. 3, 4, 5వ తరగతుల వారికి 1 నుంచి 10 శ్లోకాలు, 6, 7 తరగతుల వారికి 1 నుంచి 17 శ్లోకాలు, 8, 9, 10వ తరగతుల వారికి 1 నుంచి 24 శ్లోకాలకు పోటీ ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 89191 52915 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

• మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కమాన్‌పూర్: మండలంలోని మహిళా సభ్యులు ఆర్థికంగా ఎదుగాలని వీహబ్ టీం సభ్యులు అన్నారు. మహిళలు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్, పెరటికోళ్ల ఫాంలను శుక్రవారం టీం సభ్యులు సందర్శించారు. టీం సభ్యులు సీత పల్లచోళ్ల, జాహిద్ అక్తర్ షేక్, ఊహ సజ్జ, గురుప్రసన్న శ్రీరాం, సాయిరాం మచ్చ, డీఆర్‌డీఏ రవీందర్, ఏపీఎం శైలజశాంతి ఉన్నారు.

• అంబులెన్స్‌లోనే మహిళ ప్రసవం

రామగుండం: పట్టణంలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీకి చెందిన రోహిణికి శుక్రవారం ఉదయం పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో గోదావరిఖని జీజీహెచ్ ఆస్పత్రికి తరలిస్తుండగా మసీద్‌కార్నర్ వద్దకు చేరుకునేలోగా ప్రసవించింది. శిశువు, తల్లి ఆరోగ్యంగా ఉండడంతో కుటుంబసభ్యులు, 108 సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. 108 సిబ్బందిని స్థానికులు, కుటుంబసభ్యులు అభినందించారు.

• సేవాసదన్ గౌరవాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు మృతి

మంథని: మంథని స్వచ్ఛంద సేవా సంస్థ శాశ్వత గౌరవ అధ్యక్షుడు సువర్ణ లక్ష్మణ్‌రావు శుక్రవారం కన్నుమూశారు. 2001లో స్థాపించిన సేవాసదన్‌కు 17ఏళ్లు అధ్యక్షుడిగా సేవలందించారు. ఆయన మరణం తీరని లోటని ప్రస్తుత సేవాసదన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది హరిబాబు అన్నారు.

• ఉచిత పశు వైద్యశిబిరం

మంథని: మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్‌లో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ శంకర్, మంథని ఏడీ డాక్టర్ సంపత్‌రావు, గుంజపడుగు పశువైద్యాధికారి రవి, సూపర్‌వైజర్లు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

• సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం సైబర్ క్రైమ్ సీఐ కృష్ణమూర్తి సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

• ఆశ్రమానికి ల్యాప్‌టాప్ అందజేత

రామగుండం: ఇటీవల గోదావరిఖనిలో గుండెపోటుతో మృతిచెందిన చంద్రగిరి శ్రీనాథ్ జ్ఞాపకార్థం శుక్రవారం మృతుడి సోదరి సౌజన్య–దినేశ్ దంపతులు తబితా ఆశ్రమ చిన్నారులకు ల్యాప్‌టాప్ అందజేశారు. ఆశ్రమ నిర్వాహకుడు వీరేందర్‌నాయక్–విమల దంపతులు ఉన్నారు.

సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఈజీఎస్, సర్వేపై అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇంటింటి సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. అలాగే ఈ నెల 26న ఉపాధిహామీ పనులు పెద్దఎత్తున ప్రారంభించాలని, మార్చి ఆఖరుకల్లా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆర్డీవో గంగయ్య, డీఆర్‌డీవో రవీందర్ ఉన్నారు.

ఈపీ ఆపరేటర్లను చిన్నచూపు చూడటం సరికాదు

గోదావరిఖని: ఓసీపీల్లో జరిగే ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తున్న ఈపీ ఆపరేటర్లను చిన్నచూపు చూడటం సరికాదని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. సింగరేణి సంస్థ స్థాపించినప్పటి నుంచి బొగ్గు ఉత్పత్తిలో ప్రత్యక్ష పాత్రలో ఉన్న కోల్‌పిల్లర్స్ కాలక్రమేనా నేటి ఆపరేటర్స్‌గా మారి సింగరేణి సంస్థను కాపాడుకోవడంలో ముందుంటున్నారన్నారు. వీరికి యాజమాన్యం సమయానికి గ్రేడ్ ఇవ్వకపోవడంతో ఆర్థికంగా అన్యాయం జరుగుతోందన్నారు.

సమస్యలపై యూనియన్లకు పట్టింపేది


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

గోదావరిఖని: కార్మికుల సమస్యలపై గెలిచిన సంఘాలకు పట్టింపు లేకుండా పోయిందని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ విమర్శించారు. జీడీకే–2వ గనిపై శుక్రవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి ఎన్నికలు పూర్తయి ఏడాది గడుస్తున్నా కార్మిక సమస్యలపై మాట్లాడటం లేదన్నారు. గెలిచిన సంఘాలు యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ ఇప్పటివరకు ఒక్క పని కూడా చేయలేదని ఆరోపించారు. నాయకులు జక్కుల నారాయణ, కొమురయ్య, మణికంఠ, కుమారస్వామి, కరీంబాబా, శ్రీధర్, రాజేశ్, బోయిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్ ఆర్ఐగా స్రవంతి

కమాన్‌పూర్: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రాజకట్ల స్రవంతి శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న గౌతమ్ పెద్దపల్లి కలెక్టరేట్‌కు బదిలీ కాగా స్రవంతి కమాన్‌పూర్ ఆర్ఐగా బదిలీపై వచ్చారు.

ఈపీ ఆపరేటర్లకు పదోన్నతి కల్పించాలి

గోదావరిఖని: ఈపీ ఆపరేటర్లకు పదోన్నతి కల్పించాలని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి గడ్డం తిరుపతియాదవ్ డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలతో శుక్రవారం వారు నిరసన తెలిపి ఓసీపీ–1 మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అర్హులైన డీ గ్రేడ్‌లో ఉన్న ఈపీ ఆపరేటర్లకు పరీక్షలు నిర్వహించి సీగ్రేడ్ పదోన్నతి ఇప్పించాలని, బీ గ్రేడ్ నుంచి ఏ గ్రేడ్ పదోన్నతి కల్పించాలన్నారు. యాజమాన్యం ఇప్పటికైనా వెంటనే స్పందించి పదోన్నతి కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరసన ప్రదర్శనలు విజయవంతం చేయండి

రామగుండం: కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న జరిగే నిరసన ప్రదర్శనలు జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ కోరారు. అంతర్గాం మండల కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేశ్, రవికుమార్, చంద్రయ్య, రాజకొమురయ్య, ఆనంద్ ఉన్నారు.

సింగరేణి వార్తలు

రక్షణపై ఉద్యోగుల్లో అవగాహన పెంచాలి


సమావేశంలో పాల్గొన్న కన్వీనర్లు

గోదావరిఖని: రక్షణపై ఉద్యోగుల్లో మరింత అవగాహన పెంపొందించే లక్ష్యంగా రక్షణ పక్షోత్సవాల ఉద్దేశమని కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాలకు సంబంధించిన కన్వీనర్ల సమావేశం శుక్రవారం ఆర్జీ–2 ఏరియాలోని మెయిన్ రెస్క్యూస్టేషన్‌లో నిర్వహించారు. సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్లలో భద్రత అవగాహన పెంపొందించడం, ప్రమాదాలు తగ్గించడం, వ్యక్తిగత భద్రత, ఆరోగ్య భద్రత మొదలైన అంశాలపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు. సమావేశంలో డీఎంఎస్‌లు నాగేశ్వర్‌రావు, సేఫ్టీ జీఎంలు రఘుకుమార్, కృష్ణగోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, బానోతు సైదులు, బత్తుల శ్రీనివాస్‌రావు, నాగేశ్వరరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు కష్టపడి పనిచేయాలి


సర్వే మ్యాప్ పరిశీలిస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: రక్షణతో కూడిన ఉత్పత్తి, లక్ష్యాలు సాధించేందుకు ప్రతీఒక్కరు కష్టపడి పనిచేయాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య సూచించారు. వకీల్‌పల్లిగనిని శుక్రవారం ఆయన సందర్శించి ఉత్పత్తి వివరాలు, పనిస్థలాల తీరును మ్యాప్ ద్వారా పరిశీలించారు. 3సీమ్ టాప్ సెక్షన్, 4సీమ్‌లో నడుస్తున్న ఎల్‌హెచ్‌డీ, కంటిన్యూస్ మైనర్ యంత్రాల పనితీరును తెలుసుకున్నారు. గనికి కేటాయించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించాలన్నారు. మొదటిసారిగా గనిపైకి వచ్చిన జీఎంను గని అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి నెహ్రూ, మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, అడిషనల్ మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి రాంకుమార్, సర్వే అధికారి అఫ్సర్‌పాషా పాల్గొన్నారు.

ఖాళీల భర్తీకి రాతపరీక్ష నిర్వహణ


పరీక్షను పరిశీలిస్తున్న జీఎం ఎన్.సుధాకర్‌రావు

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలో ఖాళీగా ఉన్న సర్వే మజ్దూర్–2, డంప్ మెన్ ట్రిప్ మెన్–4, ఆఫీస్ అటెండెంట్–4 పోస్టుల భర్తీ కోసం శుక్రవారం సెక్యూరిటీ విభాగం రీడింగ్ హాల్‌లో అంతర్గత అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించారు. ఈ భర్తీలో భాగంగా సర్వే మజ్దూర్–13, డంప్‌మెన్, ట్రిప్‌మెన్–6, ఆఫీస్ అటెండెంట్–1 అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 18 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ పరీక్షల ఫలితాలను బుధవారం సాయంత్రం జీఎం కార్యాలయంలో నోటీసు బోర్డులో అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతామని జీఎం పేర్కొన్నారు. పరీక్షల కన్వీనర్, ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఓసీపీ–1 ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డీపీఎం గుర్రం శ్రీహరి, సీనియర్ పర్సనల్ అధికారులు మతీన్ హుస్సేన్, రాజేశం పాల్గొన్నారు.

మైన్‌క్లోజర్ పోర్టల్ వినియోగంపై శిక్షణ


శిక్షణ ఇస్తున్న అధికారులు

గోదావరిఖని: మైన్‌క్లోజర్ వినియోగంపై రామగుండం రీజియన్‌తో పాటు భూపాల్‌పల్లి ఏరియా అధికారులకు శుక్రవారం శిక్షణ ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని పోర్టల్‌కు అనుబంధంగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. భవిష్యత్‌లో గనుల మూసివేత సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై వివరించారు. శిక్షణలో నాలుగు ఏరియాల ఎన్విరాన్‌మెంట్, సర్వే అధికారులు పాల్గొన్నారు. ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, శిక్షకులు వి.తిరుపతి అడిషనల్ మేనేజర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

రామగిరి: ఆర్జీ–3 ఏరియా పరిధి సెంటినరికాలనీలోని సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావుకు పన్నూర్ మాజీ ఎంపీటీసీ చిందం మహేశ్ వినతిపత్రం అందజేశారు. జీఎం కార్యాలయంలో పలు సమస్యలు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఓసీపీ–2 ప్రాజెక్టు కార్యాలయం నుంచి శ్రీలంక క్వార్టర్స్‌కు వెళ్లే దారి పూర్తిగా గుంతలమయంగా మారిందని తెలిపారు. టీ2, ఎస్‌టీటూ జోన్–1, 2, శ్రీలంక క్వార్టర్లలో అంతర్గత రహదారులకు మరమ్మతు చేయాలని విన్నవించారు. కాంగ్రెస్ నాయకులు చేతి సుధాకర్, తాటి సతీశ్, వెంకటేశ్, అజయ్, బన్నీ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ప్రారంభం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తు ఫారాల ఆన్‌లైన్‌ను కంప్యూటర్ ఆపరేటర్లు శుక్రవారం ప్రారంభించారు. మండల పరిషత్‌కు వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేస్తారని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. ఎంపీవో సమ్మిరెడ్డి, కార్యాలయం సూపరింటెండెంట్ ఫక్రుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ సాదిక్ పాషా, జూనియర్ అసిస్టెంట్ అజీమ్, వేణు, అలీ ఉన్నారు.